క్లుప్తంగా

కమలసారథికి శుభాకాంక్షలు



రాంచందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొలువుదీరిన రాంచందర్‌రావును గురువారం ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల మాజీ అధ్యక్షుడు విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు కమలనాథులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నాయకులు పాపయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, జంగయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం తగదు



ఎస్‌ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై అసత్య ఆరోపణలు తగవని, వాటిని ప్రసారం చేసిన యూట్యూబ్ చానల్ నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి, డేవిడ్, హరిమోహన్‌రెడ్డి, కృష్ణ, రేణురెడ్డి, రవీందర్‌యాదవ్, నర్సింహ, అంజయ్య, గణేశ్, శేఖర్, నర్సింహ, వెంకటేశ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: సీపీఐ అనుబంధ సంస్థ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు శివరాల లక్ష్మయ్య, విజయ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలో ఈ నెల 5,6 తేదీల్లో మహాసభలు జరగనున్నాయని తెలిపారు. అధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నర్సింహ్మ, యాదయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మూత్రశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎర్ర సుధాకర్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సొంత ఖర్చుతో నిర్మించనున్న మూత్రశాల పనులను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయునిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందానని, సర్కారు బడుల బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకోటి, పాండు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ రఘుపతి, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, శంకర్, నాయకులు పర్వతాలు, నర్సింహ, రఘు, లాలయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

కడ్తాల్: మండల పరిధి వాసుదేవ్‌పూర్ నుంచి బాలాజీనగర్ వెళ్లే రహదారి.. ప్రస్తుత వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఎంపీడీఓ సుజాత రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. గురువారం జేసీబీ సహాయంతో మొరం పోయించి చదును చేయించగా.. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మాల్'ను ఆదర్శంగా తీసుకోండి

- గ్రామాలను తీర్చిదిద్దండి
- ప్రజా సమస్యలను పరిష్కరించండి
- ప్రత్యేక గుర్తింపు సాధనకు కృషి చేయండి
- ఇబ్రహీంపట్నం డీఎల్‌పీఓ సాధన



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సాధన



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శోభారాణి

యాచారం: ఆత్మ నిర్భర్ జాతీయ అవార్డును దక్కించుకున్న మాల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని, పనిచేయాలని ఇబ్రహీంపట్నం డీఎల్‌పీఓ సాధన సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలను తీర్చిదిద్ది, ప్రత్యేక గుర్తింపు సాధనకు కృషి చేయాలన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆర్థిక ప్రగతి, సోలార్ పథకాలు, సంపూర్ణ అక్షరాస్యత ఇలా పలు కోణాల్లో అగ్రగామిగా ఉండేలా దృష్టి సారించాలని చెప్పారు. మండల ప్రత్యేకాధికారి మాధవరావు మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీటి పైపుల లీకేజీ, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అనంతరం వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ రాధారాణి, మండల పంచాయతీ అధికారి శ్రీలత, మండల వ్యవసాయాధికారి రవినాథ్ పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

ఆమనగల్లు: పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేసి, పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని ఆమనగల్లు మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ ఏడీ శోభారాణి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలా పనిచేయాలి, డేటా ఎలా సేకరించాలి, దానిని ఎలా ప్రజంట్ చేయాలనే తదితర అంశాలను వివరించారు. గ్రామాల సమాచారాన్ని.. కార్యదర్శులు ప్రభుత్వం అందించిన ఫార్మాట్‌లో ఎలా నింపాలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 13 గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు ఎంపికయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమమాధురి, ఎంపీఓ వినోద, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ వైద్యాధికారి డా.మంజుల, కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ పంచాయతీ కార్యదర్శులతో పాటు, మండల స్థాయి అధికారులకు.. గ్రామాల పనితీరు, సమగ్రాభివృద్ధి, పురోగతిపై సమగ్రంగా వివరించారు. ఎస్‌బీఎం, ఎస్‌ఎస్‌జీ 2.0ల గురించి వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీఓ లాలయ్య, ఎంఈఓ సత్యనారాయణ, డాక్టర్ కిరణ్, సీడీపీఓ శాంతిరేఖ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో పల్లెలను తీర్చిదిద్దితే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025 అవార్డు వరిస్తుందని తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, అందుకు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, ఎంఈఓ రాందాస్, మంచాల, ఆరుట్ల ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు దీప్తి, శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయి విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల్: ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం పలువురు పరిషత్ నాయకులతో కలిసి తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు బకాయి చెల్లించకపోవడంతో పేద మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఫీజు కడితేనే ప్రైవేట్ కళాశాలల్లో పరీక్షలకు అనుమతి ఇస్తున్నారని, రుసుం చెల్లించలేని వారు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజు చెల్లించని వారికి కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. దీంతో చాలామంది ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఫీజు బకాయి విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పవన్, నాయకులు రమేశ్, సందీప్, హేమంత్, విష్ణు తదితరులు ఉన్నారు.

పౌర్ణమి ఉత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

ఇబ్రహీంపట్నం: గురు పౌర్ణమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏకశిలా సాయిబాబా ఆలయ చైర్మన్ మడుపు గోపాల్‌రావు కోరారు. గురువారం ఆయన పౌర్ణమి కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈసారి గురువారం పౌర్ణమి రావడం ఎంతో విశిష్టత కూడుకున్న రోజని తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. 9వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 10న ఉదయం హారతి, 108 కలశాలతో అభిషేకం, కనకాభిషేకం, సహస్ర పుష్పాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, దత్తాత్రేయ హోమం, అన్నదానం, సాయంత్రం అర్చనలు, భజన కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు. 11న ఉదయం సంప్రోక్షణ హారతి, నిజాభిషేకం, అర్చనలు, మధ్యాహ్నం హారతి, అన్నదానం, సాయంత్రం భజనలు, రాత్రి 9 గంటలకు శేష హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, బాబా ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో పల్లాటి యాదయ్య, శ్రీనివాస్, ఎం.యాదయ్య, కరుణాకర్, రాజన్న శ్రీనివాస్, ఆముదాల యాదగిరి, భర్తకి జగన్, కేడీఎం శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



అన్నదాన కేంద్రాన్ని ప్రారంభించిన క్లబ్ ప్రతినిధులు

కడ్తాల్: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీనగర్ సభ్యురాలు హరితారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రాన్ని క్లబ్ నిర్వాహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడు నిర్వహించే అన్ని కార్యక్రమాలను రెండు గ్లోబల్ క్లాజెస్‌లో చేయాలని నిర్ణయించామని, మొదటిది హంగర్ రిలీఫ్, రెండోది డయాబెటీస్ అని తెలిపారు. త్వరలో ఆయా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, జిల్లా కేబినెట్ కార్యదర్శి అంజయ్య, జోన్ చైర్మన్ లింగయ్య, క్లబ్ పీఆర్‌ఓ పాషా, క్లబ్ సభ్యులు ఓంకారం, రమేశ్, భిక్షపతి, రాంరెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి



ఈత వనాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధి మైసిగండి గ్రామంలో.. గీత కార్మికుడు శేషయ్యగౌడ్ తన వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న ఈత వనాన్ని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కల్లు గీసే సమయంలో ప్రమాదాల బారిన పడకూడదనే ఉద్దేశంతో కాటమయ్య రక్షణ కవచం పేరిట సేఫ్టీ మోకులను ఉచితంగా అందిస్తోందని పేర్కొన్నారు. గీత వృత్తిని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగా ఈత మొక్కలు పెంచేందుకు ఉచితంగా ఎక్సైజ్ శాఖ ద్వారా పంపిణీ చేస్తోందని తెలిపారు. ఆ మొక్కలను తమ పొలాలు, చెరువు గట్లపై నాటుకోవాలని సూచించారు. లైసెన్స్ లేని వారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో యాదగిరిగౌడ్, బాలయ్యగౌడ్, నరేశ్‌గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

సభకు తరలిరండి

అబ్దుల్లాపూర్‌మెట్: నగరంలోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా రానున్నారని, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచాల: శరీరంలో అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమైనవని, వాటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎస్.కె. భిక్షపతి తెలిపారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్‌క్లబ్, సాధురం కంటి వైద్యశాల సంయుక్తంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 50 మందికి కంటి అద్దాలు అవసరమని, 10 మందికి కంటి నరాల సమస్య ఉందని డాక్టర్ భిక్షపతి తెలిపారు. వారికి నగరంలోని సాధురం కంటి వైద్యశాలలో ఉచిత వైద్య చికిత్స చేస్తామని పేర్కొన్నారు. కళ్లద్దాలు అవసరమున్న వారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. ఎంఈఓ రాందాస్, డాక్టర్లు ఎం.ఎస్ రెడ్డి, భగవాన్, యాదగిరి, క్యాంప్ కో– ఆర్డినేటర్ బాలరాజ్, ప్రధానోపాధ్యాయులు తుల్జారాం, ఝాన్సీ, ఉపాధ్యాయులు జావేద్, సలీంఖాన్, యాదయ్య, ఆనంద్‌కుమార్, వాణి, నారాయణరెడ్డి, అనిత, నర్సింహ, మీన ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మంచాల: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింగ్ రావు అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలను గౌరవించాలని సూచించారు. అప్పుడే ఎలాంటి సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన లేక, చాలా మంది ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. బాలబాలికలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, వాహన బీమా తదితర పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సోమనాథ్, సంతోష్, ప్రధానోపాధ్యాయురాలు సుప్రియ, మోహన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు భాస్కర్, రాజు, ఎండీ జానీపాష, శ్రీశైలం, ఉపాధ్యాయులు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రంగారెడ్డి తనయుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గురువారం స్థానిక గార్డెన్‌లో పార్టీ యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బ్లాక్, మండలాల అధ్యక్షుల ఎంపిక నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రభుత్వం .. రైతు భరోసా, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేసిందని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నవారికి పార్టీ పదవులు దక్కుతాయన్నారు. పార్టీ అధ్యక్ష పదవులకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైయిందని, మరో రెండు రోజులు గడువుందని తెలిపారు. నేడు నగరంలో జరగనున్న సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంభాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిగాళ్ల మహిపాల్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, అమృతసాగర్, బాలరాజ్‌గౌడ్, దాసు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన దశరథానికి రూ.20 వేలు, జంగయ్య కుటుంబానికి రూ.12 వేల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు గురువారం కల్వకుర్తిలోని తన క్యాంప్ ప్రాంగణంలో ఎమ్మెల్యే బాధితులకు చెక్కులు అందజేశారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దళపతి, శివకుమార్, శ్రీశైలం, చంద్రశేఖర్, కమలేష్ ఉన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కమిషనర్ సత్యనారాయణరెడ్డికి బీజేపీ నేతల వినతి

ఇబ్రహీంపట్నం: రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు వాహన చోదకులకు అడ్డుగా మారాయని, తద్వారా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని బీజేపీ నాయకులు అన్నారు. వెంటనే వాటిని తొలగించాలని కోరారు. గురువారం వారు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నుంచి శేరిగూడ వరకు చెరువు కట్ట కింది నుంచి ఉన్న రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్– హైదరాబాద్‌కు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. చెట్ల కొమ్మలు రోడ్డు పై భాగాన నుంచి కిందకు వాలిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏదైనా ప్రమాదం జరగముందే వాటిని తొలగించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్, ఎ.రాఘవేంద్ర, అనిల్, విజయ్, రూపక్, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో గురువారం పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అవి నాణ్యతగా సకాలంలో పూర్తయ్యేలా చూడాలని సూచించారు. టెండర్ దక్కించుకుని పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూడాలని, లేదా మరోసారి టెండర్ వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు విజయ్, సుదర్శన్‌రెడ్డి, బసవలింగం, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌సింగ్, సత్యనారాయణ, పరమేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఖర్గే సమావేశానికి హాజరుకండి..

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 4న నిర్వహించే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారని, ఈ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మండల బ్లాక్ స్థాయి నాయకులు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు. కల్వకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, కల్వకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్ విజీల, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మోతీలాల్‌నాయక్, బిచ్యానాయక్, నాయకులు ఆనంద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.